# తిరుక్కోట్టియూర్ నంబి శ్రీమద్రామానుజులకు ఉపదేశించిన పదినెన్మిది అతి విశిష్టమైన వేదాంతవిషయములు

1. **మోక్షమందు కోరిక గల**– (పరమపదమైన శ్రీవైకుంఠములో శ్రీదేవి, శ్రీభూమిదేవి, శ్రీనీళాదేవి – వీరితోకలసియున్న శ్రీమన్నారాయణునికి వారి శ్రీపాదములకు నిత్య కైంకర్యమునందు కోరిక గల) అత్యంతము ఆర్తితోకూడిన – **జీవులకు** సంసారవిత్తనము అనగా ఈ భూమిపై జీవించుటకు గల ఆశలు నశించవలెను.

2. సంసారవిత్తనము(భూలోకమున జీవించుయాశలు) నశించినచో, **సత్త్వగుణము వృద్ధిచెంది**, అహంకారమమకారములు తొలగును.

3. అహంకారమమకారములు తొలగినచో, దేహాభిమానము (మన శరీరముపై ఆశలు) తగ్గును.

4. దేహాభిమానము తగ్గినచో, ఆత్మజ్ఞానము కలుగును.

5. ఆత్మజ్ఞానము కలిగినచో ఐశ్వర్యమోహములయందు (లాభము, కీర్తి, ఖ్యాతి, పేరుప్రతిష్ఠలు, సంపద, సుఖభోగజీవితములయందు) విరక్తి కలుగును.

6. ఐశ్వర్యమోహములయందు (ఆస్తి, సుఖము, భోగములతో, జీవించుటయందు) విరక్తి కలిగినచో ఎంబెరుమానునియందు – పరమాత్మయందు ప్రేమ – మిక్కిలి ప్రీతి కలుగును.

7. పరమాత్మయందు అతిప్రేమ కలిగినచో, ఇతరవిషయములయందు రుచి తగ్గును.

8. ఇతరవిషయములయందు(లోకవిషయములయందు ఇష్టము, వాటిని అనుభవించవలెనను కోరిక) రుచి తగ్గినచో, పారతంత్ర్యజ్ఞానము (మనము భగవానునికే కైంకర్యము చేయువారము, కనుక, ఆయనకోసమే జీవించుట అను జ్ఞానము) కలుగును.

9. పారతంత్ర్యజ్ఞానము కలిగినచో అర్థకామములు, రాగద్వేషములు, తగ్గును.

10. అర్థకామములు, రాగద్వేషములు(లోకవిషయములయందు ఆశలు, ప్రీతి, వెగటు) తగ్గినచో, వైష్ణవత్వము చేతికందును.

11. వైష్ణవత్వము చేతికందినచో, అది సాధుజనసాంగత్యమునందు పరిణమించును.

12. సాధుజనసాంగత్యముచే భాగవతసంబంధము కలుగును.

13. భాగవతసంబంధము కలుగగా, కలుగగా, అది భగవత్సంబంధమును(పరమాత్మయొక్క విషయములయందు, ఆచార్యులయందు అభినివేశము, నారాయణుని శ్రీపాదములయందు అతిప్రీతిని) కలిగించును.

14. భగవత్సంబంధము( లక్ష్మీదేవి, నారాయణుల శ్రీపాదములయందు భక్తి, వారి విషయములయందు ఆసక్తి, అభినివేశము) కలుగగా, ఇది పెరుమాళ్ళకు చెందిన భగవత్కైంకర్యములయందు అభినివేశమును కలిగించును.

15. భగవత్కైంకర్యములయందు ప్రీతి ఏర్పడగా, ఆ జీవాత్మ, పరమాత్మయగు శ్రీమన్నారాయణునికే దాసుడగుట అనగా నారాయణశేషత్వము (శేషియగు పరమాత్మకు మాత్రమే దాసుడగుట), శేషశేషిభావము మనస్సులో జనించును.

16. శ్రీమన్నారాయణునికిమాత్రమే దాసుడైనవాడు ఆ శ్రీమన్నారాయణునొక్కనినే శరణు పొందినవాడగును.

17. శ్రీమన్నారాయణునొక్కనియే శరణుపొందినవాడు - ఆ పరమాత్ముడగు శ్రీమన్నారాయణునికే చెందినవాడగుచున్నాడు. అనగా శ్రీమన్నారాయణశేషమగుచున్నాడు.

18. ఈవిధముగా శ్రీమన్నారాయణునికే శేషమైనవాడు వారి తిరుమంత్రమైన అష్టాక్షరీమంత్రార్థమును (జ్ఞానమును)పొందుటకు తగినవాడు. ఇట్టి జ్ఞానము పొందిన అధికారియగు జీవాత్మకే అష్టాక్షరమనబడు తిరుమంత్రము అనగా అష్టాక్షరి సిద్ధించును.

సమస్తము వాసుదేవుడే యని కృష్ణుడు చూపిన మార్గమున - భగవద్రామానుజుల దర్శనమార్గమందు - జీవించునట్టి - పెరుమాళ్ళకు మిక్కిలి ప్రీతికరమైన - ఇట్టి భక్తజీవాత్మయే - శ్రీవైకుంఠమున శ్రీమన్నారాయణుని శ్రీపాదములయందు నిత్యకైంకర్యము చేయుటయనెడు మహానందమను గొప్ప ఫలమును పొందుచున్నాడు. ఆ నారాయణుని శ్రీపాదములను పొందినవాడు ఇక వారిని విడచియుండుట యనునది యుండదు. ఈ భూమికి తిరిగి వచ్చుట అనగా భూమిపై జన్మించుట అనునది లేదు. **న చ పునరావర్తతే - న చ పునరావర్తతే.**

ఆళ్వారాచార్యరెంబెరుమానార్ జీయర్ తిరువడికళే శరణమ్

పెరియ పిరాట్టియార్- పెరియపెరుమాళ్ తిరువడికళే శరణమ్

పద్మావతీతాయార్-శ్రీనివాసపెరుమాళ్ తిరువడికళే శరణమ్

పెరున్దేవీతాయార్ -పేరరుళాళన్ తిరువడికళే శరణమ్